క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామి ఆలయంలో వాహనశాల ప్రారంభం



వాహనశాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన వాహనశాలను ఎమ్మెల్యే ఆళ్ల నాని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇష్ట దైవాలను కొలుచుకుంటూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. తొలుత ఎమ్మెల్యే నానిని అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం నాని స్వామివారికి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు నానికి స్వామివారి శేషవస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయచౌదరి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు శ్రీనివాసరావు, శ్రీధర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు బి.శ్రీనివాసరావు, శ్రీధర్ హెచ్చరించారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాలతో ఏలూరు నగరంలో వాహన తనిఖీలు చేపట్టారు. నగరంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు తనిఖీ చేపట్టారు. నగరంలో బాలలు, బాలికలు అధికంగా మోటారు సైకిళ్లు ట్రాఫిక్ రోడ్లపై నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మోటారు సైకిళ్లు పిల్లలకు ఇవ్వటం వల్ల వచ్చే అనర్థాలను వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నామని ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.



కోటేశ్వరదుర్గాపురంలో విద్యార్థికి పుస్తకాలు అందిస్తున్న దృశ్యం



ఏలూరు గాంధీనగర్ హైస్కూల్లో భోజనం తింటున్న విద్యార్థులు



విమలాదేవి స్కూల్లో జేవీకే అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



కస్తూరిబా ఉన్నత పాఠశాలలో జేవీకే అందిస్తున్న ఉపాధ్యాయులు

పేద విద్యార్థుల ఉన్నతికి సీఎం జగన్ కృషి

- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి
- నగరంలో ఉత్సాహంగా జేవీకే పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పేదవర్గాల విద్యార్థుల ఉన్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం సోమవారం నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ దేవరాయ మున్సిపల్ స్కూల్, బాలగంగాధర తిలక్ స్కూల్‌లో నిర్వహించిన విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవితో కలిసి శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా సీఎం జగన్ అమ్మ ఒడి, మన బడి నాడు – నేడు, జగనన్న గోరు ముద్ద, జగనన్న విద్యాకానుక తదితర పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా విద్యార్థులకు బడి తెరిచిన రోజునే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, డిక్షనరీలు వంటి విద్యా సామగ్రి ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశ పెట్టి ప్రపంచ స్థాయి విద్యకు గట్టి పునాది వేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇటువంటి విద్యా సంస్కరణలు జరగలేదన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లిపర భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, శ్రీదేవి



సత్రంపాడు హైస్కూల్లో జేవీకే అందజేస్తున్న డిప్యూటీ మేయర్ సుధీర్ బాబు

- సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ పాఠశాల విద్యాభివృద్ధికి అత్యధిక నిధులు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులంతా బాగా చదివి ముఖ్యమంత్రి ఆశయాన్ని నెరవేర్చాలని, అత్యుత్తమ ఫలితాలుయ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్నపనేని రవి కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని శైలజ, సీనియర్ ఉపాధ్యాయుడు వైవీఎస్ సత్యనారాయణ, ఏపీటీఎఫ్ నాయకుడు బీఏ సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.
- గాంధీ నగర్‌లోని విమలాదేవి పాఠశాలలో నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు విద్యాకాను కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ళుగా విద్యావిప్లవం కొనసాగుతోందన్నారు. విద్యార్థులంతా అంకిత భావంతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించి ముఖ్యమంత్రి ఆశయాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు, వారి తల్లులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉల్లాసంగా..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలను పునఃప్రారంభించడంతో విద్యార్థులు ఉత్సాహంగా బడి బాట పట్టారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో నగరంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం ఆశాజనకంగా నమోదయింది. విద్యార్థులు తమ పాఠశాలల యూనిఫారంతో కళకళలాడుతూ కనిపించారు. పాఠశాలలు ప్రారంభించిన రోజునే విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఉదయం రాగి జావ, మధ్యాహ్నం మెనూ ప్రకారం భోజనం అందించారు.

గ్రామాల్లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు యూనిఫారం, బ్యాగ్, బుక్స్ ఉచితంగా అందించడం గొప్ప విషయమని కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ అన్నారు. సోమవారం ఏలూరు మండల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయని సర్పంచ్ లక్ష్మీదుర్గ కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు

- స్థానిక 29వ డివిజన్ ఐసీఎం స్కూల్‌లో జేవీకే కిట్లు ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పేద పిల్లలను ఉన్నత విద్యావంతులను చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్లు వెచ్చిస్తున్నారని కొనియాడారు. కోఆప్షన్ సభ్యుడు మున్నల జాన్‌గురునాథ్, హెచ్‌ఎం సువర్ణ చంద్ర, కట్టంపూడి రంగారావు తదితరులు పాల్గొన్నారు. మాదేపల్లి, శనివారపుపేట, సత్రంపాడు జెడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు అధికారులు, ఉపాధాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా కిట్లు అందించారు.

మత్తుపదార్థాలతో యువత నిర్వీర్యం



యువతతో మాట్లాడుతున్న సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్: దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన యువత మాదక ద్రవ్యాల మత్తులో శక్తిని నిర్వీర్యం చేస్తోందని వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ అన్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాలతో ఏలూరు వన్‌టౌన్‌లోని పడమర వీధి గంగానమ్మ గుడి స్కూల్ ఆవరణలో సోమవారం యువతతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సీఐ ఆదిప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఎవరైనా యువత మాదకద్రవ్యాలు వినియోగిస్తే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఏపీ ప్రభుత్వం మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్ 14500 ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నెంబర్‌కు మత్తు పదార్థాలు వినియోగించేవారి సమాచారం తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. వేసవి సెలవులు అనంతరం స్కూల్స్, కాలేజీలకు వెళ్లే యువత, విద్యార్థులు మత్తు పదార్థాల పట్ల జాగ్రత్తలు పాటించాలని, మత్తుతో యువత చిత్తు కావద్దంటూ హితవుపలికారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలపై నిఘా మరింత పెంచామని, ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, భవిష్యత్తు నాశనం అవుతుందని యువతకు వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై మదీన బాషా, రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణ బాబు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ



ఏలూరు జేపీ కాలనీలో ర్యాలీ చేస్తోన్న ఆరోగ్య సిబ్బంది

ఏలూరు టౌన్: మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆడ అనాఫిలస్ కుట్టటంతో మలేరియా సోకుతుందని జేపీ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రూహి మీర్జా పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా జేపీ కాలనీ ప్రాంతంలో మలేరియా వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూహి మాట్లాడుతూ దోమ ఇళ్ల పరిసరాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని, వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలని పరిశుభ్రం చేయాలని అన్నారు. ఎవరైనా చలీజ్వరంతో బాధపడుతూ ఉంటే స్థానిక ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. మలేరియా మందులు, పరీక్షలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3 కోట్ల మంది మలేరియా జ్వరంతో బాధపడుతున్నారని, అనేక లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. తీవ్ర జ్వరం, చలివణుకు, చమటలు పడితే మలేరియా జ్వరంగా భావించాలన్నారు. నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, ఎయిర్ కూలర్స్, రుబ్బురోళ్లు, గ్రైండర్స్, ఫ్లవర్‌వాజ్‌లు, పూలకుండీలు ఎక్కువగా నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు పూర్ణ, రత్నం, శ్రీలక్ష్మి, పద్మావతి, ఆశా కార్యకర్తలు ధనశ్రీ, చంద్రకళ, రత్నకుమారి, నాగమణి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	10
బెండకాయలు	34	కంద	40
పచ్చిమిర్చి	56-66	బీట్‌రూట్	36
కాకర కాయలు	46	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	--	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	38	పాలకూర	8-10
దొండకాయలు	30	చుక్కకూర	8-10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	09
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	22
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	21

క్రీస్తు ధ్యానంతో చింతలు దూరం

పెదవేగి : నిత్యం క్రీస్తు ధ్యానంతో చింతలు తొలగుతాయని ఏలూరు మేత్రాసన పీఠాధిపతులు పొలిమేర జయరావు అన్నారు. పెదవేగి మండలంలోని విజయరాయి పునీత అంతోని వారి విచారణ 40 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, పొలిమేర జయరావు ఏలూరు పీఠాధిపతులుగా దశాబ్ద సేవా జీవిత ఉత్సవ వేడుకలు స్థానిక విచారణ గురువు టి దివాకర్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రధాన రహదారి నుంచి బిషప్‌ను సంఘ విశ్వాసులు, ఫాదర్‌లు, కన్యస్త్రీలు ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. దేవాలయ ప్రాంగణంలో పవిత్ర దివ్యబలిపూజ అర్పించారు. అనంతరం గురువులు బిషప్‌ను ఘనంగా సత్కరించారు. ఫాదర్‌లు మైఖేల్, కుమార్, దివాకర్, చిన్ను, ఇతర గురువులు, కన్యస్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. స్థానిక మాదేపల్లిరోడ్డులోని హేలాపురి టౌన్ షిప్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాగవంశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కేఎస్‌రావు (కొండ) ప్రతిభా పురస్కారాలను సోమవారం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్కోజు రాజగోపాలచారి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆళ్ల నాని బీసీలకు రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో అన్నింటిలో అవకాశాలు కల్పించారని తెలిపారు. ఏలూరు నగరంలో బీసీల సమస్యలను ఆళ్ల నాని సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నాగవంశీయులకు తన వంతు సహకారం అందజేస్తానని రాజగోపాలచారి అన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పది మందికి రూ.10 వేలు చొప్పున నాగవంశం జిల్లా అధ్యక్షుడు కాళ్ల శ్రావణ్ కుమార్, సునీత దంపతులు అందజేశారు. ఈ మొత్తాలను ముఖ్యఅతిథులు చేతులు మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో నాగవంశ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాయి వెంకట్రావు, ఏలూరు అధ్యక్షుడు సుఖాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండల ప్రసాద్, కాళ్ల ఆదిబాబు, ఎచ్చెర్ల ఉమ,జరజాపు ఉమ, కె.రామకృష్ణ, బాయి పాపారావు,కంటిబోతు భాస్కరరావు, మద్దుల బాబ్జి, పట్నాని రంగారావు, నిడదవోలు, ఉండ్రాజవరం, విజయవాడ ప్రాంతాల నుంచి పలువురు నాగవంశ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు భక్తులు సోమవారం రూ.1,00,002 విరాళంగా అందజేశారు. బెంగుళూరుకు చెందిన సీహెచ్‌వీఎస్ఎన్ఆర్ రామాంజనేయులు రూ. 50,001, అలాగే సీహెచ్ సుబ్బలక్ష్మి రూ. 50,001 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఇన్‌చార్జి ఈఓ ఎం.విజయరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి అభినందించారు.

ముగిసిన వేసవి శిక్షణ

ద్వారకాతిరుమల: రాష్ట్ర, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలోని వసంత్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ఫిజికల్ ఫిట్‌నెస్(ఇండోర్ రోయింగ్) శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు డైరెక్టర్ అంబటి గాంధి, వైఎస్సార్ సీపీ నాయకులు రుద్ర శివాజీ, అంబటి శివాజీ, కోచ్ ఊదర్ల విజయ్ శిక్షణ పొందిన సుమారు 85 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, గోల్డ్, సిల్వర్, బ్రౌన్ మెడల్స్‌ను అందజేశారు. కోచింగ్ క్యాంప్ ఏర్పాటుకు కృషి చేసిన విజయ్‌ను పలువురు అభినందించారు.

కోడి వ్యర్థాల వ్యాన్ పట్టివేత

పెదవేగి : అక్రమంగా రాత్రి వేళల్లో తరలిస్తున్న కోడి వ్యర్థాల వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం నుంచి భీమడోలు ప్రాంతానికి కోడి వ్యర్థాలను తరలిస్తున్నారన్న సమాచారంతో పెదవేగి ఎస్సై తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి పెదవేగి మండలం వంగూరు సమీపంలో గస్తీ కాశారు. ఏపీ 37టీసీ 9247 నంబర్ గల వాహనంలో కోడి వ్యర్థాలను తరలిస్తున్నట్లు గుర్తించి వ్యాన్‌లోని వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బురదనీరు సరఫరాతో ఇక్కట్లు

ద్వారకాతిరుమల: స్థానిక తూర్పు వీధిలో మంచినీటి కుళాయిల నుంచి గత నాలుగు రోజులుగా బురదనీరు సరఫరా అవుతోంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీసం వాడుకకు కూడా పనికిరాని విధంగా నీరు వస్తోందని, తాము నీటి కష్టాలను తాళలేక పోతున్నామని అంటున్నారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా మంచినీటి బోరు మరమ్మతులకు గురైందని, దాంతో మరో 70 అడుగుల లోతు పెంచాల్సి వచ్చిందన్నారు. దాని కారణంగా బురదనీరు వస్తోందని, మూడు నాలుగు రోజుల్లో సమస్య పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

బుట్టాయగూడెం : గత ఏడాది వైద్యం వికటించి మృతిచెందిన కబడ్డీ క్రీడాకారిణి మొడియం మంగ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్‌ను క్రీడాకారిణి తల్లి మొడియం వెంకమ్మకు సోమవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతులమీదుగా అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మంగ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్టిఫికెట్లు అందించాలి

ఏలూరు (టూటౌన్): ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించేందుకు యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాకమిటీ మాజీ సభ్యులు పులి శ్రీరాములు కోరారు. జూన్, జూలై నెలల్లో వీసాల కోసం స్లాట్‌లు రిజర్వు చేసుకోవాలన్నారు.

కల్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ సహకారం

పెదపాడు: సత్యవోలులోని కల్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయిస్తామని ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. సోమవారం పెదపాడు మండలంలోని సత్యవోలులో ఎంపీ శ్రీధర్, జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కల్యాణ మండపం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అంచనాలు తయారు చేయాలని వారికి ఎంపీ సూచించారు. అనంతరం ఇటీవల వివాహమైన వైకుంఠపు రమేష్ కుమారుడు భరత్, కునుకు వెంకట్రావు కుమారుడు పవన్‌కుమార్, మర్రాపు ఏసు కుమార్తెను ఎంపీ ఆశీర్వదించారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.